క్లుప్తంగా

బోరుచుట్టూ పారిశుధ్య పనులు



మార్కెట్‌లో బోరు చుట్టూ జరుగుతున్న పారిశుధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండల కేంద్రంలో బోరుచుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు వృథానీరు మళ్లించే పనులు మంగళవారం జరిగాయి. 'సాక్షి' పత్రికలో 'మురుగు నీరు మళ్లించడానికి దారేదీ' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమార వర్మ మాట్లాడుతూ పెదబోగిలి పంచాయతీ పరిధిలో ఉన్న సీతానగరం మార్కెట్ సమీపంలో బోరుచుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించి, వృథానీరు మళ్లించే పనులు చేపట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో ఇటువంటి సమస్యలను గుర్తించిన బోర్ల చుట్టూ చెత్తను తొలగించడం, బ్లీచింగ్ చల్లించడం. వృథా నీరు మళ్లించే విధంగా పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

పాఠశాలలకు చేరిన 'మధ్యాహ్న' బియ్యం

సీతానగరం: మండలకేంద్రంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనవంటల కోసం అద్దెవాహనంలో వచ్చిన బియ్యాన్ని పాఠశాల, కళాశాలలోని గదుల్లో చేరవేశారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ కాలేజీ, ఉన్నత పాఠశాలలు పునఃప్రారంభసమయం సమీపిస్తున్న కారణంగా ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనాలకు 24 (25 కేజీలు బియ్యం) బ్యాగ్‌లు, జీజే కాలేజీ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుకు 25 (25 కేజీలు బియ్యం) బ్యాగ్‌లు వచ్చినట్లు తెలియజేశారు.

ఎంఏఓ అవినాష్ బదిలీ

సీతానగరం: మండల వ్యవసాయాధికారి సవరపు అవినాష్‌కు కౌన్సెలింగ్ ద్వారా ఆర్.ఆమదాలవలస ఏఓగా బదిలీ అయింది. ఆయన స్థానంలో సీతంపేట ఏఓగా పనిచేస్తున్న చింతాడ ప్రసాద్‌ను నియమించినట్లు తెలిసింది. అలాగే మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా సేవలందిస్తున్న 9 మందికి స్థానచలనం కలిగింది. ఇటీవల నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో పాల్గొన్న 9 మంది కార్యదర్శులకు బదిలీ ఉత్తర్వులు మండల పరిషత్‌కు వచ్చాయని ఏఓ వెంకటరావు తెలియజేశారు.

ఎస్ఎస్ చానల్‌లో పూడిక తొలగింపు

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పదమాయవలస, చాకరాపల్లి వరకు ఎస్ఎస్ చానల్‌లో పూడిక,జంగిల్ తొలగింపు పనులు చేపడుతున్నామని ఇరిగేషన్ ఏఈ డి.వి.రమణ మంగళవారం తెలిపారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రూ.13లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నామని ఏఈ స్పష్టం చేశారు.

పెండింగ్ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయండి

రాజాం సిటీ: ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి పెండింగ్ సిటిజన్ రిజిస్ట్రేషన్లను పూర్తిచేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని కంచరాం, ఒమ్మి, గార్రాజుచీపురుపల్లి గ్రామాల సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి, ప్రజలు వివిధ సమస్యలపై అందించిన అర్జీల్లో ఎన్నింటికి పరిష్కారం చూపారని సిబ్బందిని ఆరా తీశారు. యోగాంధ్రలో భాగంగా మండలం లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరిహారమివ్వాలి



మాట్లాడుతున్న శంకరరావు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్‌సెంటర్‌లోని బెర్రీ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. అందువల్లనే పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

మురుగునీటి నిల్వలతో దోమల విజృంభణ



బలిజిపేటలో ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపక్కనే ఉన్న మురుగునీరు



నారాయణపురంలో నివాసగృహాల మధ్య ఖాళీస్థలంలో మురుగు నీరు

పంచాయతీ సహకారంతో నివారణ

గ్రామాల్లోని ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తచెదారాలను పంచాయతీ పరిశుభ్రం చేయించాలి. వారి సహకారంతో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టే అవకాశాలున్నాయి.
క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

బలిజిపేట:

మురుగునీరు, చెత్తచెదారాలతో ఖాళీస్థలాలు నిండిపోవడం వల్ల దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దోమల విజృంభణతో అంటువ్యాధులు సోకుతున్నాయి. ప్రస్తుతం జ్వరాల సీజన్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకు తార్కాణంగా బలిజిపేట బస్టాండ్ సమీపంలో ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న మురుగు నీటి గుంతల వల్ల ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. రోడ్డుకు అవతలవైపు టిఫిన్‌తో పాటు వివిధ రకాల తినుబండారాల రిక్షా బళ్లు ఉన్నాయి. దీనివల్ల అంటురోగాలు వ్యాపించే అవకాశాలున్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలి



తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రద్దు చేసిన ఎండీయూ వాహలను పునరుద్ధరించి రేషన్ బియ్యం ఇతర సరుకులు సరఫరా చేయాలని సీపీఎం మండల, జిల్లా నాయకులు డిమాం డ్‌చేశారు. ఈ మేరకు ఎండీయూ వాహనాల రద్దుకు నిరసనగా మంగళవారం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకులు ఇంటింటికీ చేరవేయడానికి, నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను సమకూర్చిందన్నారు. ఎండీయూ వాహనాలు సరుకులు సరఫరా చేయడంతో వృద్ధులు, దివ్యాంగులుతో పాటు ప్రజలు సకాలంలో నిత్యావసర సరుకులు ఇంటిదగ్గర అందుకునేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఎండీయు వాహనాల రద్దు చేయడంతో రేషన్ వినియోగదారులు సరుకుల నిమిత్తం డిపోలకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, ఒక్కోసారి సరుకులు పంపిణీ చేయడానికి నెట్‌వర్క్ సర్వీసులు మొరాయించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇంటివద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, ఆర్.రాము, ఎండీయూ వాహన నిర్వాహకులు ఎం.సింహాచలం, టి.రాఘవ, పి.తిరుపతిరావు, పోలిరాజు పాల్గొన్నారు.

కళాశాలలో గిరిజనులకు సీట్లు పెంచాలి



పాలక రంజిత్‌కుమార్

పార్వతీపురం: గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సీట్లు పెంచాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి పీటీజీ(బాలికలు)లో 120 సీట్లు, భద్రగిరి (బాలురు)లో 120 సీట్లు, కురుపాం మండలంలోని గురుకుల కళాశాలలో (బాలికలు) 80సీట్లు, పాచిపెంట మండలం పి.కోనవలస (బాలురు)లో 140 సీట్లు, పి.కోనవలస(బాలికలు)లో 140 సీట్లు మొత్తం 600 సీట్లు ఉన్నాయన్నారు. అయితే ఈఏడాది 1,239 మంది ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీంతో 639 మందికి సీట్లు లభించని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి మరో 120 సీట్ల కోసం గిరిజన గురుకుల సొసైటీకి ప్రతిపాదన చేసినప్పటికీ ఇంకా అనుమతి రాలేదన్నారు. ఈమేరకు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థులకు కళాశాలల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పది గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదన చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. దీంతో గిరిజన విద్యార్థులకు చదువుకునేందుకు అవకాశం లేకుండా పోతోందని, అధికారులు స్పందించి గిరిజన గురుకుల కళాశాలలో సీట్లు పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పాడైన మాంసం, చేపల గుర్తింపు

సాలూరు: పట్టణంలో పాడైన చేపలు, మాంసాన్ని అధికారులు గుర్తించి సదరు వ్యాపారులకు అపరాధ రుసుము విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అధ్వర్యంలో ప్రజారోగ్య సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పట్టణంలోని చేపలు, మాసం విక్రయించే దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 కేజీల పాడైన మాంసం, 20 కేజీల చేపలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను పాటించని విక్రయదారులకు రూ.10 వేల అపరాధ రుసుము విధించారు. నిబంధనలు పాటించకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపార పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదని, కొలతల్లో తేడాలు ఉండరాదని తదితర అంశాలపై స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇంజ్రాయిల్ దాడులను ఖండించాలి



పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.శ్రీనునాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురంలోని ఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 'పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల గురించి మానవీయ కోణంలో ఆలోచించే ఇలాంటి పుస్తకం తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ మనదేశంలో ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు సామ్రాజ్యవాదుల ప్రయత్నాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, సిరికి స్వామినాయుడు, సీనియర్ న్యాయవాది టి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీల పర్యవేక్షణ



జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం రూరల్: యోగాంధ్ర మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో పోటీలను కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పోటీలను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండల, పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. శనివారం వరకు జరిగే ఈ పోటీల్లో యోగా గురువు మోహన్ గంతాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాలు అలాగే 35 సంవత్సరాల పైబడిన వారిని వివిధ గ్రూపులుగా కేటాయించినట్లు తెలిపారు. సోలోగా ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్ యోగా గ్రూప్ ప్రదర్శన, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, క్విజ్, స్లోగన్స్, పోస్టర్స్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు షెడ్యూల్ ప్రకారం జరిగేలా కార్యాచరణ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డా.సుశీల, ఎంపీడీఓ రమేష్, జిల్లా కన్సల్టెంట్ డా.రఘు, యోగా మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సక్రమంగా బియ్యం సరఫరా చేయాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌లో వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

- సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం రూరల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పాఠశాలలకు సక్రమంగా బియ్యాన్ని సరఫరా చేయాలని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించా రు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిల్వలను పరిశీలించి రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రతి పాఠశాలకు రవాణాకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురువారం నుంచి పాఠశాలలు, వసతిగృహాలు ప్రారంభం కానున్న దృష్ట్యా బియ్యం పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. రవాణాకు ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యవేక్షణ పక్కాగా ఉండాలని పాఠశాలలో వసతిగృహాలకు పంపిణీ పూర్తిచేసిన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్వతీపురం తహసీల్దార్ జయలక్ష్మి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి



వాహన పత్రాలను పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు రాకపోకలు సాగించేటప్పుడు ట్రాఫిక్ పరమైన జాగ్రత్తలు పాటించాలని పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మండలంలోని ఆర్‌కే బట్టివలస, వెంకంపేట వై జంక్షన్ తదితర కూడళ్లలో ఆమె వాహన తనిఖీలను రూరల్ పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. అనంతరం వాహన చోదకులతో మాట్లాడుతూ విధిగా హెల్మెట్ ధరించాలని, అలాగే పరిమితికి మించి వాహనాలపై ప్రయాణం చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై అపరాధ రుసుం విధించారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం బుధవారం నిర్వహించ నున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

13న మెగా జాబ్ మేళా

బొబ్బిలి: పట్టణంలోని విద్వాన్ డిగ్రీ కాలేజీలో ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.మోహనరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ గ్రూప్స్‌లో వివిధ విభాగాల్లో నియామకాల కోసం కంపెనీ సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. 2020-25 సంవత్సరాల మధ్య ఇంటర్, డిగ్రీ(బీఏ,బీకాం,బీఎస్సీ) ఉత్తీర్ణులైన నిరుద్యోగయువతను ఎంపిక చేస్తారన్నారు. సుమారు 200 మంది వరకూ ఉద్యోగులను ఎంపిక చేసే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటా,సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, రెండు పాస్ పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకుని 13వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన

రేగిడి: విత్తన గుళికల తయారీపై సోమరాజుపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్-2 గౌరీశ్వరరావు, సురేష్ మంగళవారం అవగాహన కల్పించారు. కందులు, మినుములు,పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న తదితర రకాల విత్తనాలను మట్టిలో కలిపి గుళికలుగా తయారు చేసుకోవాలన్నారు. ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని చెప్పారు. విత్తనగుళికలను పొలాల్లో వెదజల్లితే వర్షాలకు మొలకెత్తుతాయని వివరించారు.వీఏఏ అసిరినాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.రమాదేవి, జి.సింహాచలం, కె.పార్వతి, పి.గౌరీశ్వరరావు,.పైల తవిటినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

రేగిడి: మండలంలోని దేవుదల, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్.నూకాలమ్మ మంగళ వారం తనిఖీలు చేశారు. రికార్డులు, కేంద్రంలో పౌష్టికాహార పథార్థాల స్టాక్‌ను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువును కొలిచారు.అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని చెప్పారు. సమయానికి కేంద్రాలు తెరవాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులతో సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న పనికి తగిన వేతనం పొందలేకపోతున్నారన్నారు. నైపుణ్యం ఉన్న కార్మికుల వేతనాలను పెంచకపోవడం శోచనీయమన్నారు. 15 ఏళ్లు పూర్తిచేసిన కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొన్న కార్మికుల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని, సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినయ్, బాబూరావు, గణపతి, చిన్ని కృష్ణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల

నిరవధిక సమ్మె



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు తదితరులు

సాలూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలని, సంక్షేమ పథకాల అమలు కోసం త్వరలో నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ ప్రభుత్వం వారి శ్రమను గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌కుమార్, శ్యామ్, కాశినాయుడు, ఈశ్వరరావు, శ్రీను, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- కొమ్మినేని అరెస్టు దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశానని, ఇటువంటి అరాచకాలను తానెప్పుడూ చూడలేదని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తుందన్న అక్కసుతోనే సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం నీచమైన చర్యగా పేర్కొన్నారు.రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ అక్రమ అరెస్టులు చేయిస్తున్నారన్నారు. చంద్రబాబుకు తన సొంత బావమరిది మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు వినిపించలేదా అని ప్రశ్నించారు.చర్చా గోష్టిలో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలతో తమకే మాత్రం సంబంధం లేదని సాక్షి యాజమాన్యం ఖండించినా ఆ సంస్థ కార్యాలయాలపై టీడీపీ గూండా మూకలు దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతనైతే ప్రజల నుంచి ఏ విమర్శ లేకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలే తప్ప అరాచకపాలన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, ,నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నడిమింటి సత్యనాయుడు, సింహాచలంనాయుడు పాల్గొన్నారు.